

# డిప్యూటీ ఇఒ, హెచ్‌ఎం పోస్టులను కేటాయించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిఒ 1 ప్రకారం ఐటిడిఎ ఉప విద్యా శాఖాధికారి పోస్టులను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు కేటాయించాలని గిరిజన సంక్షేమ డైరెక్టరు ఉత్తర్వులు ఇచ్చారని, ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళి మోహనరావు కోరారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పోస్టులు, సర్వీసు రూల్స్ కోసం ప్రభుత్వం వద్ద ఫైల్ ఉందని, ఈ సర్వీసు రూల్స్ వచ్చే వరకు గిరిజన సంక్షేమ సీనియర్ పిజి హెచ్‌ఎంలకు ఎఫ్ఎసి ఇవ్వాలని డైరెక్టరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నారు. కావున ఐటిడిఎ పిఒ దీన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.



# పట్టభద్రుల పోరు

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 16న నోటిఫికేషన్
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న పరిశీలన
- ఉపసంహరణ గడువు 27
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- అమల్లోకి ఎన్నికల కోడ్
- ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు
- పిడిఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ రమాప్రభ

*పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల కోడ్ 3 ఉమ్మడి జిల్లాల్లో గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు (కొంత భాగం), అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి.*

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా 23న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా నిర్ణయించారు. మార్చి 13న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. మార్చి 16న కౌంటింగ్ జరుగనుంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రధానమైన రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించాయి. విశాఖ జిల్లా నుంచే ప్రధానంగా అభ్యర్థులంతా బరిలో ఉండడం విశేషం. వైసిపి అభ్యర్థిగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, టిడిపి అభ్యర్థిగా డాక్టర్ వేపాడ చిరంజీవిరావును, బిజెపి మద్దతు సిట్టింగ్ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పోటీ చేయనున్నారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలోకి దిగారు. ఈమె అభ్యర్థిత్వాన్ని సిపిఎం బలపరుస్తోంది. అధికార పార్టీ అండతో వైసిపి బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపుకోసం అన్ని శక్తులనూ ఒడ్డుతుండగా, టిడిపి బలపరచిన డాక్టర్ చిరంజీవిరావు పేరును అత్యంత ఆలస్యంగా ఆ పార్టీ వెల్లడించింది. ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థిత్వంపైనా, బిజెపి సిట్టింగ్‌పైనా సొంత పార్టీల్లోనే వ్యతిరేకత పలు తరగతుల నుంచీ వ్యక్తమవుతోంది. మాధవ్ గెలిచి ఉత్తరాంధ్రకు ఏ విషయంలోనూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. సొంత పార్టీలోనూ ఇదే వ్యక్తమవుతోంది. అధికార వైసిపి అభ్యర్థి సుధాకర్ ఓటర్ల చేర్పింపు నుంచి ఇప్పటి వరకూ ప్రలోభాలతో గట్టెక్కే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈయన ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ వినియోగించుకుని, దొంగ ఓటర్లను చేర్పించి లబ్ధిపొందాలని చూస్తున్నారంటూ పలువురి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

**ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఓటర్లు, బూత్‌ల వివరాలు**

| మొత్తం పోలింగ్ బూత్‌లు | మొత్తం ఓట్లు | మహిళలు | పురుషులు | ట్రాన్స్‌జెండర్లు |
|---|---|---|---|---|
| 293 | 2,83,751 | 1,48,025 | 1,78,796 | 40 |

**ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి ముందంజ**

ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలన్నిట్లోనూ సామాజిక కార్యకర్తగా పలు కార్యక్రమాలతో 30ఏళ్లుగా అన్ని తరగతుల దృష్టినీ ఆకర్షిస్తూ వస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో నిస్వార్థంగా, నిజాయితీగా, ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై కృషి చేస్తున్న తీరు, ఆమె సొంత పాపులారిటీతో పాటు ఈ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా ఉంది.

ఉత్తరాంధ్ర ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలపైనా, ఎపి విభజన తర్వాత ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపైనా ఆమె తరచూ విశాఖ కేంద్రంగా తన గళాన్ని వినిపిస్తూ ఉండడం మరో ప్రత్యేకతగా ఉంది. రైల్వేజోన్ సాధన, పోలవరం, సుజల స్రవంతి రావాలని కోరుతూ పలు కార్యక్రమాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఈ తరగతులకు మద్దతుగా నిలిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం ప్రజల గొంతుకగా చట్టసభల్లో వినిపించేందుకు రమాప్రభ సన్నద్ధమవుతున్నారు.

## నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి-కలెక్టర్

కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గురువారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు 24 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు, పోలీసు బందోబస్తుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, కలెక్టరు కార్యాలయ ఎఒ ఆర్.ఉమామహేశ్వరరావు, ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు డి.రవి హాజరైనారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

# బడ్జెట్‌లో ఉపాధికి నిధులు పెంచాలి

## పోస్టాఫీస్ వద్ద ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

వ్యవసాయం ఉపాధికి బడ్జెట్లో నిధులు పెంచాలని కేంద్ర కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలకు ఆలిండియా ప్రజా సంఘాల పిలుపులో భాగంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీస్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 - 24 బడ్జెట్ పేద ప్రజలకు, రైతులకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. బడ్జెట్లో వ్యవసాయానికి భారీగా నిధులు తగ్గించారని, ఉపాధి పథకానికి గతేడాది రూ.89 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.60 వేల కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. అలాగే పౌరసరఫరాలకు, ఆహార సబ్సిడీకి భారీగా సుమారు రూ.90 వేల కోట్లు నిధులు తగ్గించారన్నారు. విద్య, వైద్య రంగానికి నిధులు తగ్గించి కార్పొరేట్ పెట్టుబడుదారులకు అనుకూలమైన బడ్జెట్ తీసుకొచ్చారని, పేదలపై పరోక్ష పన్నుల భారం పెంచారని, కార్పొరేట్ పన్నులు తగ్గించారని అన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల 25 వేల నిధులు కేటాయించాలని, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని విద్య, ఉపాధి ఆహార భద్రతకు సబ్సిడీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, సహాయ కార్యదర్శి కరణం రవీంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సహాయ కార్యదర్శి పి. రాము, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర, రెడ్డి వేణు, కోశాధికారి జి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎఎన్‌ఎం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

**కలెక్టరేట్:** వైద్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఎఎన్ఎం, ఆశా వర్కర్లు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, రక్తహీనత ఉన్న చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పక్కాగా సేవలు అందాలని, వాలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది సేవలు ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ, పంచాయతీ రాజ్ ఇఇ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి టి.జగన్మోహన రావు, సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కొమరాడలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రఘురాం

# ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలు ఉగాదినాటికి పూర్తి కావాలని హౌసింగ్ ప్రాజెక్టు అధికారి పి.రఘురాం అన్నారు. మండలంలో గంగరేగువలస, కొమరాడలో చేపడుతున్న గృహ నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో చేపడుతున్న నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణాలు వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం గృహ నిర్మాణదారులకు బిల్లులు మంజూరు కూడా సకాలంలో చేస్తుందని, కావున లబ్ధిదారుల పనులు వేగవంతం చేయాలని అన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కాలనీలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్తు, కాలువలు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే నిధులు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్న విషయాన్ని గమనించాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పరిశీలిస్తూ ఉంటారని కాబట్టి లబ్ధిదారులకు ఇబ్బందులు ఉన్నా తెలియజేస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేసి ఇళ్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు కురుపాం సబ్ డివిజన్ డిఇ డి.మోహనరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఇవి ధాన్యం కాదా?

## సిపిఎం పరిశీలనలో బయటపడ్డ వేలాది ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

జిల్లాలో 95శాతం ధాన్యం కొనుగోలు చేశామని, కేవలం ఐదు శాతం మాత్రమే గ్రామాల్లో ధాన్యం ఉన్నాయని అధికారులు చెప్పడం పూర్తిగా అవాస్తవమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొల్లి గంగునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పెదతుంబలిలో గురువారం సిపిఎం నాయకులు ధాన్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు చేయక నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. ధాన్యం అన్ని కొనేశామని చెబుతున్న అధికారులకు ఇవి ధాన్యం కావా అని ప్రశ్నించారు. ఒక్క పెదతుంబలే కాకుండా మండలంలో సుమారు 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో నిల్వ ఉన్నాయని అన్నారు. జిల్లాలో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వలుంటాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ప్రభుత్వ నిబంధనలు పరిగణలోకి తీసుకొని కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని అన్నారు. మోడీ చేసిన వ్యవసాయ చట్టాలను జగన్మోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు చేయకుండా ఇతర పంటలకు మద్దతు ధరలు ఇవ్వకుండా వ్యవసాయం చేయడానికి విసుగుచెందేలా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు నిలిపివేయడం వల్ల రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో అటువంటి బేరసారాలు జరుగుతున్నాయని, ఇలా వారాల తరబడి ధాన్యం సేకరించకుండా తాత్సారం చేస్తూ రైతులను ఎంతో కొంత అమ్ముకునేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని, ఇప్పటికైనా జిల్లా ప్రభుత్వం స్పందించి కనీసం ఇ - క్రాప్ చేసిన ధాన్యాన్ని అయినా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న కాలంలో రైతుల ఆవేశాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని హెచ్చరిం చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గరుగుబిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస : పెదబుడ్డిడిలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

**మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**

**కొమరాడ :** గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని రామభద్రపురం, ఉలిపిరి, అల్లుడా, కేర్జల తదితర గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతూ ధాన్యాన్ని దాచుకోలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి సకాలంలో నగదును జమ చేయాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీని పరిశీలిస్తున్న డిఇవిఒ మంజులవీణ

# ప్రాక్టికల్ పరీక్షలకు సన్నద్ధం కావాలి

**పాలకొండరూరల్ :** ఇంటర్ విద్యార్థులకు ఈనెలాఖరున ప్రారంభం కానున్న ప్రాక్టికల్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని డిఐఇఒ డి.మంజుల వీణ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. ప్రయోగ పరీక్షలకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాలని కోరారు. సిసి కెమెరాలను అమర్చాలని సూచించారు. పరీక్షలను ఎటువంటి మాస్ కాపీయింగ్ కు వీలు లేకుండా చూడాలని కోరారు. ఇప్పటి వరకు ప్రయోగ పరీక్షలకు విద్యార్థులకు ఇచ్చిన తర్ఫీదును ఆయా లెక్చరర్లను అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న ప్రయోగాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వెనుకబాటులో ఉన్న విద్యార్థులను గుర్తించాలన్నారు. వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు ఇప్పటినుండి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు 21 సెంటర్లను గుర్తించామన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విధంగా బోధనా పద్ధతులు అనుసరించాలని కోరారు..హ్యూమన్ వాల్యూస్ అండ్ ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె ప్రిన్సిపాల్స్ ను కోరారు. ఆమె వెంట ప్రిన్సిపాళ్లు ఎం. కుమారస్వామి,ఎస్. సత్యనారాయణ, అధ్యాపకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

# మార్చి 8న మహిళా మార్ట్ ప్రారంభం

**వీరఘట్టం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో సిసిలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని వీరఘట్టం మండలం నుంచి మహిళా మార్ట్ ప్రారంభించాలని ఉద్దేశంతో వీటిపై దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. మండలంలోని 1752 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, ఇంతవరకు 456 సంఘాల నుంచి ఒక్కొక్క సభ్యుడి ద్వారా రూ.200 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మరింత సభ్యుల ద్వారా వసూలు చేసేందుకు తమ వంతు కృషి చేయాలని సిసిలను ఆదేశించారు. గత ఏడాది డిసెంబర్ 31లోగా వసూలు చేయలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ మీ నిర్లక్ష్యం వల్ల వసూలు కాలేదన్నారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారా? లేదా, వీటిని బట్టి అర్థమవుతుందని అన్నారు. నెలకు ఒకసారైనా గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తే సభ్యులకు అవగాహన ఉంటుందని , ఆ దిశగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో మూడో విడత వైయస్సార్ ఆసరా ఇచ్చేందుకు 14,383 మందికి రూ 79.65 కోట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని 101 కల్యాణమస్తుకు దరఖాస్తులు రాగా ఆరుగురికి మంజూరైనట్లు తెలిపారు. అలాగే మండలంలో రైతుల వద్ద ఎంత నిల్వలు ధాన్యం ఉన్నాయని పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సిసిలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శివున్నాయుడు, మండల మహిళా సమైక్య అధ్యక్షులు పి సుజాత, సిసిలు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలి

- లేకుంటే పిల్లల్ని పంపించం : తల్లిదండ్రులు
- పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులు
- అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కోన ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు గురువారం మొహం చాటేశారు. బుధవారం నాటి సంఘటనకు బాధ్యులైన స్థానిక ప్రధానోపాధ్యాయుడ్ని, మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటేనే పిల్లలను బడికి పంపిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు ఖరాఖండీగా చెప్పేశారు. గురువారం ఎంఇఒ మల్లేశ్వరరావు పాఠశాల విద్యార్థులు, విద్యా కమిటీ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అయితే అస్వస్థతకు గురైన విద్యార్థులు కొంతమంది గురువారం కూడా కడుపు నొప్పితో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు తప్ప ఇంతవరకు నోటిమాట ద్వారా కూడా చర్యలు ఊసెత్తలేదని ముక్తకంఠంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తాగునీటి ట్యాంకు, పరిసరాల శుభ్రతకు చర్యలు చేపడతామని ఎంఇఒ ఎంత నచ్చజెప్పినా తల్లిదండ్రులు వినకపోవడంతో సమావేశం ముగించారు. ఉపాధ్యాయులంతా విధులకు హాజరైనప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో పాఠశాల బోసిపోయింది.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ మల్లేశ్వరరావు

**షోకాజ్ నోటీసులు ఇస్తాం**

బుధవారం కోన పాఠశాలలో జరిగిన ఘటనపై సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నోటీసులు ఇవ్వనున్నట్టు ఎంఇఒ పి.మల్లేశ్వరరావు విలేకరులకు తెలిపారు. వారికి లిఖితపూర్వక వివరణ అనంతరం జిల్లా అధికారులకు అందజేయడం జరుగుతుందని ఉన్నతాధికారులే మిగతా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు ఈ కార్యక్రమంలో జిల్లా సిబ్బంది కే రంగబాబు మణికంఠ తదితరులు పాల్గొన్నారు

**ఆహార భద్రత, మిడ్డే మీల్స్ అధికారుల సందర్శన**

జిల్లా ఆహార భద్రత అధికారి పి.వెంకటరమణ, మధ్యాహ్న భోజనం సహాయ సంచాలకులు సుమా భాను గురువారం స్థానిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బుధవారం ఘటనలో బాధితులైన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచే మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న ఆహారంలో ప్రస్తుతం నిల్వ ఉన్న బియ్యం, గుడ్లు, వంట నూనె, తాగునీటిని పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరించారు. అనంతరం ఆహార భద్రత అధికారి బాధిత విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుడ్లు వండిన ఆహారంపై సరైన నిర్వహణ లేదంటూ విద్యార్థుల వారి ముందు వాపోయారు. మిడ్డే మీల్స్ అధికారి సుధా భాను స్థానిక ప్రధానోపాధ్యాయులు జయరాంను, మిడ్ డే మీల్స్ నిర్వాహకులు లక్ష్మిని ఘటన జరిగిన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నివేదికను జిల్లా కలెక్టర్‌కు, డిఇఒకు అందజేయనున్నట్టు తెలిపారు.

**విద్యార్థులకు పరీక్ష కాలం**

ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం అత్యంత పరీక్షకాలం నడుస్తుందని చెప్పాల్సి వస్తుంది. కొంతమంది విద్యార్థులకు స్థానికంగా పరీక్షలు నిర్వహణ చేపట్టారు. ఇటువంటి సమయంలో బుధవారం నాటి ఘటన విద్యార్థుల పాలిట విషమపరీక్షలగా మారింది. ఒకవైపు తల్లిదండ్రులు స్కూలుకు పంపించేందుకు నిరాకరించడం, మరోవైపు పరీక్షల సమయం కావడం విద్యార్థులకు ఏం చేయాలో అర్థం కాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యకు పరిష్కార మార్గం కనుగొని విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు



వంటసామగ్రి, తాగునీటి నమూనాలను సేకరించి ఆహారభద్రత అధికారులు


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కమర్

## సక్రమంగా భూములు రీ సర్వే

**భామిని :** మండలంలోని నులకజోడు రెవెన్యూ పరిధిలో ఉన్న భూములు రీ సర్వేను గురువారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లుమడకు చెందిన రైతులు దామోదర అప్పుడు, మురళి సాహు, తాము గతంలో కొనుగోలు చేసి, సాగు చేస్తున్న భూమి ఆన్ రిజిస్టర్ కాపీ చూపించి, తాము గతంలో భూ యజమాని వద్ద భూమి కొనుగోలు చేశామని, పేదరికం డబ్బులు లేక భూమిని రిజిస్టర్ చేసుకోలేదని అన్నారు. ప్రస్తుతం ఈ భూమిని రీసర్వేలో తమ పేరు మీద రికార్డు చేయాలని సబ్ కలెక్టర్ను కోరారు. సదరు భూ యజమాని తహశీల్దార్ వద్ద భూమి మీకు అమ్మినట్టు వాంగుమూలం ఇస్తే, మీ పేరు మీద మార్పిస్తామని సబ్ కలెక్టర్ బదులు ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, సర్వేయర్ రామ్మోహన్, ఆర్ఐ రాంబాబు, వీఆర్ఓ జయరాజు, నులకజోడు ఎంపిటిసి బూసి బాలకృష్ణ, సాకేటి రామారావు ఉన్నారు.

## తోటపల్లి ఎడమ కాలువ నీరు విడిచి పెట్టాలి

**కురుపాం :** తోటపల్లి ఎడమ కాలువ నీరు తక్షణమే విడుదల చేయాలని టిడిపి మండల కన్వీనర్ ఎ.మధుసూదనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం గరుగుబిల్లి మండలం ఖడ్గవలస జంక్షన్ వద్ద పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక్క పడి కాలువ ద్వారా నీరు విడిచిపెట్టడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎడమ కాలువ ద్వారా నీటిని విడిచి పెట్టాలని, పనులైనా చేపట్టాలని కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చామని అన్నారు. ఇప్పటికైనా నీటిని విడిచిపెట్టక పోవడం లేదు సరే కదా పనులు కూడా జరగడంలేదని అన్నారు. తక్షణమే రైతుల బాధలను అధికారులు స్పందించి నీరు విడుదల చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే రైతుల దగ్గర ఉన్న ప్రతి ధాన్యం గింజ కొంటామని చెబుతూ వచ్చిన అధికారులు, అధికార పార్టీ పెద్దలు ఇప్పుడు ముఖం చాటేయడం ఎంతవరకు న్యాయమని, వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల టిడిపి జిల్లా టిడిపి కార్యదర్శి ఎం బి. విజయ్ అంకుశం, జిల్లా టిడిపి బిసి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు. టిడిపి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట సుమన్ పాల్గొన్నారు.

## మూగబోయిన ఎయిర్టెల్ సేవలు

**కురుపాం :** నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గత నాలుగు రోజులుగా ఎయిర్ టల్ సేవలు మూగబోయాయి. దీంతో ఎయిర్టల్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ చిన్న పని కావాలన్నా, సమాచారం ఎవరికి అందించాలన్నా, విషయం తెలుసుకోవాలన్నా నిత్యం ప్రజలు మొబైల్ ఫోన్ మీదే ఆధారపడ్డాడు. ఈ సమయంలో ఎయిర్టెల్ సేవలకు ఇబ్బందులు ఏర్పడడంతో వినియోగదారులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి ఎయిర్టెల్ సేవలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

**సీతంపేట :** స్థానిక ఐటిడిఎ పరిధిలో గల శ్రీకాకుళం జిల్లా మెలియపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో గానూ తాత్కాలిక పద్ధతి గెస్ట్ టీచర్ ఇంగ్లీష్ టిజిటి ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 20లోగా మెలియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ పాఠశాలను పాతపట్నం వైటిసిలో నిర్వహిస్తున్నారని, అక్కడ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలని, బిఇడి అర్హత సాధించాలని అన్నారు.


## కనీస వేతనాలు వచ్చేలా పనులు

**కొమరాడ :** ఉపాధి వేతనదారులు కనీస వేతనాలు వచ్చేలా పనులు చేయాలని ఎంపిడిఒ ఎల్వి అప్పారావు అన్నారు. మండలంలోని గంగిరేగువలసలో పనులు చేస్తున్న లింగనాయుడు చెరువు (430794) వద్ద కూలీలు చేస్తున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులకు ఎంతమంది వేతనదారులు వచ్చారు. ఏ మేరకు కొలతలకు పని చేస్తున్నారని వివరాలు ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ కనీస వేతనాలు రావాలంటే కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఉపాధి వేతనం రూ.250 వచ్చేలా పనులు చేసుకుంటే లబ్ధి చేకూరుతుందన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సక్రమంగా పనిచేస్తే కనీస వేతనాలు వస్తాయన్నారు. ప్రతి ఉపాధి వేతనాదారునికి కనీస వేతనాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కావున వేతదారులకు సరైన పనిని, కొలతల ప్రకారం చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకపాత్ర వహించాలన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్, మేట్లు ఉన్నారు.

## నాణ్యతతో కూడిన ఆహారం అందించాలి


వంటలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ అప్పారావు

**కొమరాడ :** గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు, విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపిడిఒ ఎల్వి అప్పారావు అన్నారు. మండలంలోని ఉలిపిరి, ఉలిపిరి వలస, రామభద్రపురం అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అందుతున్న పోషకాహారం ఇచ్చే వివరాలను అడిగి తెలుసుకుని పరిశీలించారు. పోషకాహారం ఇచ్చే వారి వివరాలు బోర్డులు పెట్టి తెలియజేయాలన్నారు. అనంతరం ఉలిపిరి బాలికల వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. మెనూ అమలు చేయకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపిడిఒ కృష్ణమహేష్రెడ్డి

## మేట్లకు కొలతలపై అవగాహన

**సీతానగరం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఎపిఒ జి. నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం మేట్లకు ముందస్తు కొలతలు, మస్టర్ పట్టికపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశం నుంచే గ్రూపు ఫోటోను హాజరు పట్టికను పంపించాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన రూ.257 వచ్చే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం గుచ్చిమి గ్రామంలో జరుగుతున్న పనులను ఎంపిడిఒ బి. కృష్ణ మహేష్రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్ వెరిఫికేషన్ను చేశారు. ప్రతి ఒక్కరూ నిర్ధేశించిన సమయంలో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, మెట్లు వేతన దారులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి కృషి

**సీతంపేట :** ట్రాన్స్ జెండర్ సంక్షేమానికి కృషి చేస్తామని మెప్మా పీడీ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో గురువారం ట్రాన్స్ జెండర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి పెన్షన్లు అందజేస్తామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్, వాలంటీర్లను కలవాలన్నారు. సంక్షేమ పథకాలు అందేటట్లు చర్యలు చేపడతామన్నారు. వెలుగు ద్వారా శిక్షణ ఇచ్చే స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అవసరమైతే బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో వెలుగు ఎపిడి నారాయణరావు, ఎంపిడిఒ కె. గీతాంజలి, మండల విస్తరణాధికారి కొండపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కొటియా ప్రజల అభివృద్ధికి ఒడిశా అడ్డు

**ప్రజాశక్తి - సాలూరు**

కొటియా గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఒడిశా అధికారులు అడ్డుకుంటున్నారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆరోపించారు. గురువారం గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన దూళిభద్రలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వంతో ఎపి ప్రభుత్వం సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తోందని చెప్పారు. సీనియర్ సిఎం నవీన్ పట్నాయక్ అంటే ఎపి సిఎం జగన్మోహన్రెడ్డికి ఎనలేని గౌరవం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో కొటియా వివాదాన్ని చర్చలు జరిపి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే కొంతమంది కొరాపుట్ అధికారులు అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కొటియా గ్రామాల్లో ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం దుర్మార్గమని అన్నారు. సుప్రీంకోర్టు స్టేటస్కో ఉత్తర్వుల ప్రకారం రెండు

డిప్యూటీ సిఎం రాజన్నదొర


మహిళలకు బ్రోచర్ను అందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

రాష్ట్రాల ప్రభుత్వాలు కొటియా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసుకోవచ్చునని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ఒడిశా అధికారులు అడ్డుకోవడం తగదని అన్నారు. కొటియా గ్రామాల ప్రజలు ఎపి వైపు ఉండడానికి సుముఖంగా ఉన్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. దీనిలో భాగంగా సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్న కొటియా, గంజాయిభద్ర గిరిజనులను ఒడిశా అధికారులు అడ్డుకోవడం అన్యాయమని విమర్శించారు. ఒడిశా ప్రభుత్వానికి చేతనైతే ఎపిలో మాదిరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కానీ గిరిజనులను నియంత్రించడం తగదన్నారు. సిఎం జగన్మోహన్రెడ్డి కొటియా వివాదం విషయంలో సంయమనం పాటించాలని చెప్పారని తెలిపారు. అవసరమైతే తాము కూడా ఒడిశా అధికారులు, పోలీసుల్లా అభివృద్ధి పనులు అడ్డుకోగలమని చెప్పారు. కొటియా గ్రామాల ప్రజలకు ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలను అందేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు సువ్వాడ రామకృష్ణ, సువ్వాడ భరత్ శ్రీనివాస్, ఎంపిడిఒ జి.పార్వతి,ఎపిఓ కష్టారావు, గిరిజన నాయకులు గెమ్మెల భీషు, గొర్లి రాజారావు పాల్గొన్నారు.

## 'నా ఆరోగ్యం కుదుటపడింది'

**వీరఘట్టం :** ప్రజలందరి ఆశీస్సుల వల్ల తన ఆరోగ్యం కుదుటపడిందని స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి అన్నారు. గురువారం మండలంలోని సిధిమి గ్రామంలో విశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసిన సందర్భంగా మాట్లాడారు. గత కొంతకాలం నుండి అనారోగ్యంగా ఉన్నానని ఆ భగవంతుని దయవల్ల ఆరోగ్యం కుదుట పడిందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి డి. వెంకటరమణ నాయుడు, సర్పంచులు డి. ఉమామహేశ్వరరావు, డి. రవికుమార్ పాల్గొన్నారు.

## నవోదయకు గడువు పొడిగింపు

**కలెక్టరేట్ :** నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్టు డిఇఒ డాక్టర్ ఎస్డిపి రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు తమ పాఠశాల పిల్లలను ప్రోత్సాహించి నవోదయ పరీక్షలకు దరఖాస్తు చేసుకొనేలా చూడాలని ఆయన ఆదేశించారు.

# హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు అమర్చాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

వాహనాలకు హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు అమర్చుకోవాలని జిల్లా రవాణాశాఖాధికారి సి. మల్లిఖార్జున రెడ్డి అన్నారు. 2013 తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు విధిగా 'హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు' ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర రవాణ మంత్రిత్వశాఖ, రాష్ట్ర రవాణాశాఖ కమీషనరు ఉత్తర్వుల జారీ చేశారని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. వాహన యజమానులు, వాహన డీలర్లు, ఫైనాన్సియర్లు వాహనం నంబరు ప్లేటు పొందడానికి ముందస్తుగా 'ఈ-ప్రగతి' వెబ్ పోర్టల్ను (https://aprtacitizen.epragathi. org/#!/Hsrpbookingslot) ఉపయోగించి, వాహన రిజిస్ట్రేషను సంఖ్యను నమోదు చేసి, అమర్చటానికి అనుకూలమైన తేదీని, నంబరు ప్లేట్లు అమర్పు రవాణాశాఖ కార్యాలయం వద్దనా లేక ఇంటివద్దనా అనే విషయాలను పొందుపర్చవచ్చునన్నారు. సంబంధిత అంశాలకు నిర్దేశిత రుసుము చెల్లించాలని ఆయన చెప్పారు. ఎంపిక చేసుకున్న తేదీ నాటికి ' హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు' తయారు చేసి, బిగింపునకు సిద్ధంగా ఉన్నట్లు చరవాణికి సందేశం వస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు ఆదేశానుసారం జిల్లాలో 2013 సంవత్సరం తరువాత రిజిస్టర్ అయిన ప్రతి వాహనదారుడు తమ వాహనాలకు ఈ నెల 25వ తేదిలోగా హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ను అమర్చుకోవాలని ఆయన అన్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ పై రవాణా శాఖ తనిఖీలు నిర్వహించి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్లేని వాహనాలకు అపరాధ రుసుం విధించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాత్రి పూట వాహనాలను నడపడానికి అనువుగా ట్రాన్స్పోర్టు వాహన యజమానులు అందరూ విధిగా రి ఫ్లెక్టర్ టేప్లను అతికించాలని ఆయన చెప్పారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి- పాలకొండ రూరల్**

పట్టణంలో పలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పాలకొండ మండల కన్వీనర్ డి. రమణారావుతో పాటు ఎ.లక్ష్మణరావు, కె.రాముల ఆధ్వర్యంలో గురువారం నగర పంచాయతీ కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఇంటింటికి సిపిఎం కార్యక్రమంలో భాగంగా ప్రజలు పలు సమస్యలను బృందం దృష్టికి తీసుకువచ్చారన్నారు. రాతపూర్వకంగా సచివాలయాలకు, మున్సిపల్ అధికారుల దృష్టికి అనేక పర్యాయాలు తీసుకురావడం జరిగిందని, నేటికీ సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందని అన్నారు. తక్షణమే వివిధ వార్డుల్లో పలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ గ్రామానికి దూరంగా తరలించాలని, బుట్టమట్టం కాలనీ భారీ చెరువు వద్ద ఉన్న స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, ఎన్. కె. రాజపురంలో


కమిషనర్కు వినతినిస్తున్న సిపిఎం నాయకులు

నెయ్యిలవీధి, దేవుడమ్మ వీధి తదితర ప్రాంతాల్లో మురికి కాలువలు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని, గ్రామాన్ని మున్సిపాలిటీని యూనిటీగా తీసుకొని డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని, గారమ్మ కాలనీ, బుట్టుమట్టం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పట్టణంలో సుమారు 100 వీధి దీపాలు వెలగడం లేదని తదితర ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## పనులు పూర్తి చేయాలి

**వీరఘట్టం :** పాలకొండ నియోజకవర్గంలోని అనేక గిరిజన ప్రాంతాలకు చేపట్టిన రహదారులను తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వీరఘట్టం మండలంలోని నీలంపేట, బట్టిగూడ, బల్లగుడ్డ, కె.ఇచ్ఛాపురం, కాగితాడ, గదబవలస, ఎలిసిపురం తదితర గిరిజన గ్రామాల రహదారులు నేటికీ అభివృద్ధి అందకపోవడంతో గిరిజనుల రాకపోక సాధించేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు ఆరోపించారు. 2019లో నీలంపేటలోని రోడ్డుకు రూ4.6 కోట్లతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారని, అవి నేటికీ పూర్తి కాకపోవడంతో రాళ్లు తేలి దర్శనం ఇస్తుందని అన్నారు. రూ.36 లక్షలతో బల్లగుడ్డ రహదారి నిర్మాణ పనులు చేపట్టి అది కూడా పూర్తి రాలేదని, రూ.25లక్షలతో రామపురానికి బిటి రహదారి నిర్మాణం చేపట్టేందుకు పనులు అది కూడా నేటి పూర్తి రాకపోవడంతో చిన్నపాటి చినుకుపడినా రహదారులు బురదమై రాకపోకలు సాధించేందుకు గిరిజనులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని అన్నారు.

# జిఒ 5 ప్రకారం జీతాలు పెంచాలి

### కెజిబివి ఉద్యోగుల డిమాండ్ ● జిల్లా వ్యాప్తంగా నల్ల రిబ్బన్లతో నిరసనలు

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్, వేపాడ, భోగాపురం**

కెజిబివిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిమం టైం స్కేలు జీవో నెంబర్ 5 ప్రకారం జీతాలు పెంచాలని ఎపి సమగ్ర శిక్ష అభియాన్ కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పలసూరి, బి.కాంతారావు, నాయకులు భారతి డిమాండ్ చేశారు. జీవో 5 ప్రకారం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సిలో ఇచ్చిన 23శాతం జీతం పెంచడాన్ని వారు ఖండించారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా అన్ని కెజిబివిల వద్ద గురువారం నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2018లో గత ప్రభుత్వం ఇచ్చిన ఎంటిఎస్ జీవో నెంబర్ 24ను విడుదల చేసిందని, అప్పటినుండి కెజిబివి బోధన సిబ్బందికి జీతాలు పెంచాలని అనేక పోరాటాలు చేశామన్నారు. టీచర్ల ఆందోళన, అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకుండా 23శాతం జీతాలు పెంచామని చెప్పి టీచర్లకు


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కెజిబివి ఉద్యోగులు

అన్యాయం చేశారని అన్నారు. బోధనా సిబ్బందికి హెల్త్ కార్డులు, మెడికల్ లీవ్లు లేవని తెలిపారు. మహిళలకు ఇస్తున్న ప్రత్యేక సిఎల్ఎస్ కూడా కెజిబివి టీచర్లకు వర్తింపజేయలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిఒ 5 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఫ్లైఓవర్పై ప్రమాదాలను నివారించండి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

పట్టణంలోని ఫ్లైఓవర్ పై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. గురువారం ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడును జనసేన జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు, బంటు శిరీష్, జి. అజయ్ కుమార్ కలిసి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, నాటుసారా అమ్మకాలు, ఈవ్ టీజింగ్, గంజాయి అమ్మకాలు, ట్రాఫిక్ తదితర సమస్యలపై చర్చించారు. పట్టణ ఫ్లై ఓవర్ పై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయని పలువురు మృత్యువాత పడుతున్నారని అన్నారు. . తక్షణమే ఫ్లైఓవర్ పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

# గర్భిణులకు వైద్య పరీక్షలు

**సీతానగరం :** మండలంలోని పెద అంకలాం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం పిఎంఎస్ఎం యోచన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎం. రాధాకాంత్, కె. శిరీష మాట్లాడుతూ గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భం దాల్చిన నుండి ప్రతినెల ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు చేపించుకోవాలన్నారు. రక్తహీనత ఉంటే వాటికోసం ప్రత్యేకమైన వైద్య సేవలు అందిస్తామ న్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రశవం జరిగే విధంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్విలు డి సత్యవతి, ఎం. వరలక్ష్మి, పాల్గొన్నారు.

**వీరఘట్టం :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, బరువు, ఎత్తు తదితరమైన వైద్య తనిఖీలు నిర్వహించి ఆరోగ్యం పై సూచనలు చేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతి కుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొమరాడ:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాధరావు అన్నారు. ప్రతి


సీతానగరం: గర్భిణులకు తనిఖీ చేస్తున్న వైద్యురాలు

నెల 9న జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) కార్యక్రమాన్ని కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం పరిశీలించారు. అనంతరం గర్భిణులతో మాట్లాడారు. వారికి అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహా రాన్ని సరిగ్గా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఆరోగ్య కేంద్రం వద్ద జరిగే రక్తపరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని, రక్తహీనత ఉన్న గర్భిణులకు ఇచ్చే మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని కోరారు. మూడు అంతకంటే ఎక్కువ ప్రసవాలు జరిగిన మహిళలు గర్భ నిరోధక ఆపరేషన్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పిహెచ్సిల్లో మందులు, రక్తపరీక్షల తీరు పర్యవేక్షించి వైద్యులకు గర్భనిరోధక ఆపరేషన్లు చేయించుకోమని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

# గ్రామాల్లో ప్రజలకు అవగాహన

**ప్రజాశక్తి - వీరఘట్టం**

పొడి, తడి చెత్తలను వేరు చేయడంలో గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిపి డి. వెంకటరమణ నాయుడు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక సప్త సంపద కేంద్రంలో జగనన్న స్వచ్ఛ సంకల్ప అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేరు చేసిన చెత్తలను వీధుల్లో తిరిగే చెత్త రిక్షాల ద్వారా నేరుగా సంపద కేంద్రానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీటి ద్వారా సంపదను తయారు చేయడమే కాకుండా రైతులకు కూడా అవగాహన కల్పించి తయారు చేసిన ఎరువులను విక్రయాలు జరపాలన్నారు. ప్రతి ఒక్కరు ఆ దిశగా చర్యలు తీసుకుంటే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుతో పాటు స్వచ్ఛమైన ఎరువుతో పంటలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. గౌరమ్మ, ఎంపిడిఒ ఎ. ప్రభాకర్ రావు, డిపిఆర్సి కోఆర్డినేటర్ వెంకట్ రాజు, ఈవో రామచంద్రరావు, జిల్లాలోని 15 మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 108 సేవలపై ఆరా

**పాలకొండ :** జిల్లాలో 108 అంబులెన్స్లు అందిస్తున్న సేవలపై 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్ పాలకొండ స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగ భూషణ్ను గురువారం కలిసి ఆరా తీశారు. ఏంటి నేటల్ డే సందర్భంగా గర్భిణులు 108 ద్వారా చెకప్ చేయించుకోవచ్చునన్నారు. ఏరియా ఆసుపత్రికి 108 ద్వారా తీసుకువచ్చే కేసులను గమనిస్తూ, 108 సిబ్బంది యొక్క సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈయనతో పాటు 108 వాహన సిబ్బంది గణపతి, తేజ, సంతోష్, నాని, అనంత్, ఉన్నారు.

# మన్యంపై మంచు దుప్పటి

**ప్రజాశక్తి- సీతంపేట**

మన్యంలో దట్టమైన అడవులు ఉండటంతో ఉదయం ఏడు గంటల వరకు మంచు దుప్పటి చుట్టూ కమ్మేస్తుంది. సూర్యుడు ఉదయించే వరకు ఒకరి మొఖం ఒకరికి కనిపించడం లేదు. దీంతో వాహన చోధకులు బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. సూర్యుడు ఉదయించే వరకు వాహనాల రాకపోకలు నిలిపివేయాలని లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా పొగ మంచు అధికంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.


దట్టంగా కురుస్తున్న మంచు

# సచివాలయ సందర్శన

**ప్రజాశక్తి- పాలకొండ రూరల్**

మండలంలోని గోపాలపురం సచివాలయాన్ని ఎంపిడిఒ దొంక త్రినాధులు గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు పిఎంజెఎవై సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ త్రినాదులు

## అందుబాటులో అటవీ ఉత్పత్తులు

**కురుపాం :** ఎరువులు లేకుండా గిరిజన ప్రాంతంలో పండినటువంటి అటవీ ఉత్పత్తులు ఆర్ట్ సంస్థలో అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధి ఎన్. సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా అటవీ ప్రాంతంలో పండినటువంటి పసుపు, చింతపండు, కొండ చీపుర్లు, తేనె, అల్లం, జీడి తదితర ఉత్పత్తులు వాడడం వల్ల మానవ ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. కావున ఈ ఉత్పత్తులు కావలసినవారు 9398887576 గల నెంబర్ను సంప్రదించాలని కోరారు.

# ధాన్యం వివరాలు సేకరణ


**ప్రజాశక్తి - సీతానగరం**

మండలంలోని గురువారం చినబోగిలి, పెదబోగిలి, లక్ష్మీపురం, బూర్జ వెంకటాపురం, చల్లమనాయుడు వలస తదితర గ్రామాలలో రైతులు వద్ద నుంచి ధాన్యం బస్తాల వివరాలను సివిల్ సప్లయ్ డిఎస్ఒ కెవిఎల్ ఎన్ మూర్తి, సిఎస్డిటి రమేష్, ఎఒ ఎస్ అవినాష్ సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఏ రైతు వద్ద ఎన్ని ధాన్యం ఉన్నాయి? ఆ గ్రామంలో రైతులు ఎంతమంది ఉన్నారు? వాటి వివరాలను పొందుపరిచి అనంతరం రాష్ట్ర నుంచి అనుమతులు వచ్చిన తరువాత రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

## చెక్కులు అందజేత

**భామిని:** 2021 జులైలో మండలంలోని కోటకొండకు చెందిన ఇద్దరు చిన్నారులు పాలక కీర్తి, అరిక అంజలి ప్రమాద శాత్తు మరణించిన నేపథ్యంలో సిఎం సహాయనిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 2లక్షలు చొప్పున విడుదలయ్యాయి. ఈ చెక్కులను పాలక కీర్తి తండ్రి పాలక అప్పారావుకి, అరిక అంజలి తండ్రి అరిక గుర్మకి ఎమ్మెల్యే విశ్వాసారాయి కళావతి వండువా గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, బొడ్డగూడ సర్పంచ్ అనంత్, భామిని ఎంపిటిసి బిడ్డికి తులసి, బత్తిలి ఎంపిటిసి టింగ అన్నాజిరావు, బొడ్డగూడ సచివాలయం కన్వీనర్ అరిక జమ్మయ్య, వైసిపి నాయకులు గేదెల మోహన్ పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

## వార్డెన్ సుందరి మృతి

**ప్రజాశక్తి - సాలూరు**



పట్టణంలోని గిరిజన బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ ఎం.సుందరి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు. మెదడులో రక్తం కట్టడంతో ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. అందరి తలలో నాలుకలా వ్యవహరించిన వార్డెన్ సుందరి అకాల మరణం పట్ల పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు గురువారం రామాకాలనీలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు ఆమె మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు జె.పైడిరాజు ఆమెకు నివాళులు అర్పించారు. పాచిపెంట మండలం వెలగవలసలో శుక్రవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.